

వైద్యులపై దాడులు తగవు

కొన్నిసార్లు పేషెంట్ల బంధువుల నుంచి వైద్య ఆరోగ్య సిబ్బంది దాడులను ఎదుర్కోవలసి వస్తుంది. ప్రతి వైద్యుడు వృత్తిని దైవంగానే భావిస్తారు. పేషెంట్ శరీరం ఒక్కోసారి వైద్యానికి సహకరించదు. దీనిని బంధువులు అర్థం చేసుకోకుండా వైద్యులను నిందిస్తారు. పేషెంట్‌కు మంచి జరిగితే పరవాలేదు. లేదంటే వారి బంధువుల నుంచి ఇబ్బందులు తప్పడం లేదు. ఆస్పత్రులకు వచ్చే పేషెంట్ బంధువుల ఆలోచన మారాలి. ముఖ్యంగా ప్రభుత్వ ఆస్పత్రులకు వచ్చేవారు బాధ్యతాయుతంగా మెలగాలి.

– ఎ.బి.మల్లికార్జునరావు, ప్రధాన వైద్యుడు, పీహెచ్‌సీ, తాళ్లవలస



మహిళా సిబ్బందే అధికం

ప్రజారోగ్య రంగంలో సేవలందిస్తున్న వారిలో 70 శాతం మహిళలే. వీరికి జాబ్ చార్ట్ కేటాయించాలి. విధుల అవసరాన్ని బట్టి 12 నుంచి 36 గంటలు పని చేయవలసి వస్తుంది. అలాంటి సిబ్బందికి ప్రభుత్వం ఆహారం, రక్షణ వంటివి ఏర్పాటు చేయాలి. దాడులు జరిగితే తెలియచేయడానికి టాస్క్‌ఫోర్స్ ఫోన్ నంబర్లను ఆస్పత్రుల్లో ఏర్పాటు చేయాలి. వైద్య ఆరోగ్య సిబ్బందిని రక్షించేందుకు ప్రత్యేక చట్టాలు చేయాలి. దాడులకు పాల్పడే వారికి వెంటనే శిక్షలు అమలు కావాలి.

– బి.శోభారాణి, వైద్యురాలు, తాళ్లవలస పీహెచ్‌సీ, భీమిలి మండలం



పోలీస్ ఎస్కార్ట్ ఉండాలి

ఆరోగ్యం విషమంగా ఉన్న కేసులు వచ్చేటప్పుడు వైద్య ఆరోగ్య సిబ్బందికి ఒత్తిళ్లు తప్పవు. కొన్నిసార్లు పేషెంట్ బంధువులే కాకుండా బయట వ్యక్తులు కూడా గుంపులుగా వచ్చి కావాలనే గొడవలకు దిగుతారు. ఫొటోలు, వీడియోలు తీసి బెదిరిస్తుంటారు. దీనివల్ల భవిష్యత్తులో వారే నష్టపోతారు. అందువల్ల విషమంగా ఉన్న పేషెంట్ చికిత్సా సమయంలో పోలీస్ ఎస్కార్ట్ తప్పనిసరిగా ఉండాలి. వైద్య సిబ్బందికి రక్షణ అవసరం.

– దాసరి గౌరి, ఏఎన్ఎం, మజ్జివలస, భీమిలి మండలం

క్లుప్తంగా

నేడు మధురవాడకు అయోధ్య శ్రీరామ ధనుస్సు

మధురవాడ: జీవీఎంసీ 8వ వార్డు మధురవాడ బాలాజీ హిల్స్‌పై ఉన్న వేంకటేశ్వర స్వామి సన్నిధికి శనివారం సాయంత్రం 5 గంటలకు అయోధ్య రామాలయంలో ప్రతిష్ఠించనున్న వెండి ధనస్సు వస్తుందని ఆలయ కమిటీ కార్యదర్శి మగ్గూరి వెంకటరావు తెలిపారు. దేశమంతటా తిరుగుతూ అందులో భాగంగా ఇక్కడి భక్తుల దర్శనం కోసం ధనుస్సు ఉంచుతామని చెప్పారు. భక్తులకు స్వయంగా కోదండాన్ని స్పర్శ దర్శనం చేసుకునే అవకాశం ఉంటుందన్నారు. భక్తులంతా పాల్గొని రాముల వారి కృపకు పాత్రులు కావాలని వెంకటరావు కోరారు.

కృష్ణాష్టమి వేడుకలకు ఆహ్వానం

తగరపువలస: ఈ నెల 26 నుంచి సెప్టెంబర్ 5 వరకు త్రైత సిద్ధాంత భగవద్గీత ఇందూ జ్ఞానవేదిక ఆధ్వర్యంలో ప్రబోధానందుని శిష్యులు మజ్జివలస ఆశ్రమంలో నిర్వహించనున్న శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలకు పలువురు ప్రముఖులను ఆహ్వానించారు. కమిటీ అధ్యక్షుడు గౌతమ్ శివ కుమార్ వర్మ, అప్పలనాయుడు, జయరామ్, భారతి, కె.నారాయణ, అప్పలనారాయణ తదితరులు శుక్రవారం ఈ ఆహ్వాన పత్రికలు అందించారు. పద్మనాభం మండలం పాండ్రంగిలో మాజీ మంత్రి ఆర్.ఎస్.డి.పి.అప్పలనరసింహరాజు, భీమిలి వైస్ ఎంపీపీ బోని బంగారునాయుడు తదితరులను ఆహ్వానించారు.

తప్పిపోయిన బాలుడి అప్పగింత



అర్మాన్‌ను తల్లి నదియా, అన్న అన్వర్‌కు అప్పగిస్తున్న భీమిలి పోలీసులు

భీమునిపట్నం: ఇంటి నుంచి వెళ్లి తప్పిపోయిన బాలుడిని శుక్రవారం భీమిలి పోలీసులు అతడి తల్లికి అప్పగించారు. నగరంలోని ఆరిలోవకు చెందిన నదియాకు చెవిటి, మూగతో ఉన్న పదేళ్ల మహ్మద్ అర్మాన్ అనే కొడుకు ఉన్నాడు. ఈ బాలుడు శుక్రవారం ఉదయం నుంచి కనిపించడం లేదు. బీచ్‌ను చూడాలన్న కోరికతో భీమిలికి వచ్చాడు. తరువాత ఎటు వెళ్లాలో తెలియక బీచ్ రోడ్డులో తిరుగుతుండగా గమనించిన పోలీసులు స్టేషన్‌కు తీసుకొచ్చారు. బాలుడు తన వివరాలు చెప్పలేకపోవడంతో వీరు ఇతడి ఫొటోలను పలు వాట్సాప్ గ్రూపుల్లో పంపడంతో తల్లి నదియా చూసి బాలుడి అన్న అన్వర్‌తో కలిసి భీమిలి పోలీస్ స్టేషన్‌కు వచ్చింది. వారికి అర్మాన్‌ను ఎస్ఐ హరీష్ అప్పగించారు.

ఈ-రిసోర్సెస్‌ను సద్వినియోగం చేసుకోండి

విశాఖ సిటీ: ఆంధ్రా యూనివర్సిటీ గ్రంథాలయంలోని ఈ-రిసోర్సెస్‌ను విద్యార్థులు, పరిశోధకులు పూర్తి స్థాయిలో సద్వినియోగం చేసుకోవాలని ఏయూ ఆర్ట్స్, కామర్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య ఎ.నరసింహారావు సూచించారు. ఏయూ హెచ్ఆర్‌డీసీ కేంద్రంలో శుక్రవారం కె.నింబస్ డిజిటల్ లైబ్రరీపై అవగాహన కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సాంకేతిక ప్రగతి నేపథ్యంలో విస్తృతమైన జ్ఞానాన్ని పొందే సౌలభ్యం నేడు విద్యార్థులకు ఉందన్నారు. విద్యార్థులు ఉపయుక్తంగా ఈ-బుక్స్, ఈ-జర్నల్స్‌ను అందుబాటులోకి తీసుకొచ్చామని చెప్పారు. వీటిపై అవగాహన పెంచుకొని తమకు ఉపయుక్తంగా వినియోగించుకోవాలన్నారు. కార్యక్రమంలో గ్రంథాలయాధికారి ఆచార్య పి.వెంకటేశ్వర్లు, అధిక సంఖ్యలో విద్యార్థులు పాల్గొన్నారు.

ఉన్నత విద్యకు ఆదరణ శూన్యం

- చిట్టివలస ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో వసతుల లేమి
- ఇబ్బందులు పడుతున్న విద్యార్థులు, అధ్యాపకులు
- కాలేజీ నిర్వహణపై స్థానిక గ్రామాల ప్రజలకు సమాచారం కరువు



చిట్టివలస జెడ్పీ బాలికల హైస్కూల్ వసతి గృహంలో నిర్వహిస్తున్న ప్రభుత్వ డిగ్రీ కళాశాల



కళాశాల తరగతి గది

తగరపువలస: చిట్టివలసలో మూడేళ్ల కిందట ప్రారంభించిన ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు ప్రచారం కరువైంది. కనీ వసతులు లేక విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. కళాశాలలో సకల సౌకర్యాలు కల్పించడంతోపాటు విస్తృతంగా ప్రచారం చేపట్టాలని, అప్పుడే భీమిలి గ్రామీణ ప్రాంత విద్యార్థులకు ఉన్నత విద్య చేరువవుతుందని స్థానికులు కోరుతున్నారు.

2018లో అప్పటి టీడీపీ ప్రభుత్వం చిట్టివలసలో ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల నిర్మాణానికి బంగ్లామెట్ట వద్ద శిలాఫలకం వేసింది. 2019లో అధికారంలోకి వచ్చిన వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం 2019-20 విద్యా సంవత్సరానికి చిట్టివలస జెడ్పీ బాలికల హైస్కూల్‌లో రెండు గదులను తీసుకుని ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలను ప్రారంభించినా.. ఆలస్యం కావడంతో ఆ ఏడాది అడ్మిషన్లు జరగలేదు. కోవిడ్ ముగిసిన తర్వాత ఎట్టకేలకు 2021-2022 విద్యా సంవత్సరంలో బీకాం కంప్యూటర్స్, బీఎస్సీ తరగతులు ప్రారంభమయ్యాయి. అప్పటికే బాలికల హైస్కూల్‌కు తరగతి గదుల కొరత కారణంగా మహిళా డిగ్రీ కళాశాలకు గదులు కేటాయించలేకపోయారు. ఆ తరువాత ఇదే హైస్కూల్ ఆవరణలో రూ.2 కోట్లతో నిర్మించిన కళాశాల బాలికల వసతి గృహం ప్రారంభానికి నోచుకోకపోవడంతో.. ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలను తాత్కాలికంగా ఇప్పటి వరకు ఇదే భవనంలో వసతులు లేకపోయినా నిర్వహిస్తున్నారు.

గతేడాది నుంచి కో ఎడ్యుకేషన్..

2023-24 విద్యా సంవత్సరం నుంచి మహిళా డిగ్రీ కళాశాలను కో ఎడ్యుకేషన్‌గా మార్చారు. గతేడాది మొదటి బ్యాచ్ విద్యార్థులు రిలీవ్ కూడా అయ్యారు. ప్రస్తుతం ఈ తాత్కాలిక భవనంలో బీఏ-హిస్టరీ, బీకాం కంప్యూటర్స్, బీఎస్సీ-మ్యాథ్స్, బోటనీ, జువాలజీ, కెమిస్ట్రీ సబ్జెక్టులతో నిర్వహిస్తున్న డిగ్రీ తరగతులకు గాను 37 మంది విద్యార్థులు, వారికి బోధించడానికి కాంట్రాక్ట్ అధ్యాపకులు ఉన్నారు. గత నెలలో మొదటి విడత ప్రవేశాలకు గాను 196 మంది రిజిస్ట్రేషన్ చేసుకోగా.. ఈ నెల 16న గడువు ముగిసేలోగా 69 మంది ప్రవేశాలు పొందారు. నగరంలోని డాక్టర్ వి.ఎస్.కృష్ణా డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ ఐ.విజయబాబు ఇన్‌చార్జి ప్రిన్సిపాల్‌గా ప్రస్తుతం చిట్టివలస ప్రభుత్వ డిగ్రీ కళాశాల నడుస్తుంది.

ప్రచారం నిల్..

వాస్తవానికి చిట్టివలసలో ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల నిర్వహిస్తున్నట్టు ఈ చుట్టుపక్కల గ్రామాల ప్రజలకు తెలియదు. దీనిని కో ఎడ్యుకేషన్‌గా మార్చినా సమాచారం లేదు. ఈ ప్రాంతంలో ఇంటర్మీడియట్ ఉత్తీర్ణులైన వారు భీమిలి ప్రభుత్వ డిగ్రీ కళాశాల లేదంటే స్థానిక ప్రైవేట్ డిగ్రీ కాలేజీల్లో చేరిపోతున్నారు. ఆన్‌లైన్‌లో ప్రవేశాల కోసం దరఖాస్తులు చేసుకున్న వారిలో పాడేరు, అరకు, అనకాపల్లి ప్రాంతాల నుంచి వచ్చిన విద్యార్థులు తప్ప స్థానికుల్లో ముగ్గురంటే ముగ్గురు విద్యార్థులు కూడా లేరు. రెండేళ్ల కిందట స్థానిక దాతలు ఇచ్చిన ఫర్నిచర్, స్టేషనరీలతో కళాశాల మనుగడలో ఉన్నా.. అంతకు మించి వసతులు ఇక్కడ కల్పించలేదు.



కుళాయిలు ఏర్పాటు చేసి.. తాగునీరు మరిచారు


కనీస వసతులు కల్పించాలి..

ప్రస్తుతం కళాశాలలో 37 మంది విద్యార్థినులతో పాటు కో ఎడ్యుకేషన్‌గా మార్చిన కారణంగా ఈ ఏడాది మొదటి విడత కౌన్సెలింగ్ ద్వారా 69 మంది చేరారు. వీరికి తరగతులు, కార్యాలయ అవసరాలకు ఆరు గదులు అందుబాటులో ఉన్నాయి. రెండో విడత కౌన్సెలింగ్ ద్వారా మరిన్ని ప్రవేశాలు జరుగవచ్చు. ఈ తాత్కాలిక వసతి గృహంలో విద్యార్థినులు, అధ్యాపకులకు తాగునీరు, టాయిలెట్లు లేవు. ఇంగ్లిష్, హిస్టరీ, ఫిజిక్స్ బోధించే అధ్యాపకుల నియామకం జరగాలి. ఇటీవల విద్యుత్ సరఫరా ప్రారంభమై ఫ్యాన్లు బిగించారు. ప్రస్తుతం కళాశాల నిర్వహిస్తున్న లోపలి ప్రాంతం నిర్మాణంలో ఉండటం, బయట తుప్పలు, డెబ్రిస్‌తో నిండి ఉండటంతో ఒక విద్యా సంస్థకు ఉండాల్సిన వాతావరణం కనిపించడం లేదు.

రెండో విడత కౌన్సెలింగ్ ప్రారంభం..

డిగ్రీలో ప్రవేశించే వారికి రెండో విడత కౌన్సెలింగ్ ప్రక్రియ ఈ నెల 22 నుంచి ప్రారంభమైంది. 24వ తేదీ వరకు రిజిస్ట్రేషన్లు, 23 నుంచి 25 వరకు సర్టిఫికెట్ల వెరిఫికేషన్, వెబ్ ఆప్షన్ల నమోదు, 26న వెబ్ ఆప్షన్ల మార్పు, 29న సీట్ల కేటాయింపు జరుగుతుంది. ఈ నెల 30 నుంచి సెప్టెంబర్ 3 వరకు విద్యార్థులు కాలేజీలో చేరాల్సి ఉంటుందని కళాశాల ప్రతినిధుతు తెలిపారు. వివరాలకు 90100 22182 నంబర్‌లో సంప్రదించవచ్చు.

శ్రీలక్ష్మీ నమోస్తుతే



పూజలందుకున్న శ్రీ లక్ష్మీనారాయణులు



చంద్రంపాలెంలో దుర్గాలమ్మ

కొమ్మాది: స్థానిక అన్నంరాజునగర్‌లోని అష్టలక్ష్మీ దేవాలయంలో శ్రావణ మాసం మూడో శుక్రవారం సందర్భంగా శ్రీ లక్ష్మీనారాయణులకు ప్రత్యేక పూజలు వైభవంగా నిర్వహించారు. వేకువజామున సుప్రభాత సేవ అనంతరం మహాలక్ష్మి హోమం, శ్రీలక్ష్మీనారాయణులను, అష్టలక్ష్ములను ప్రత్యేకంగా అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. సాయంత్రం మహిళలచే సామూహిక పారాయణాలు నిర్వహించినట్లు ఆలయ ప్రధాన అర్చకుడు చామర్తి శ్రీధరస్వామి తెలిపారు. భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలుగకుండా ఆలయ ధర్మకర్తలు అన్నంరాజు సత్యనారాయణ, రమాదేవి దంపతులు పర్యవేక్షించారు.

దుర్గాలమ్మకు విశేష పూజలు

మధురవాడ: శ్రావణ మాసం మూడో శుక్రవారం సందర్భంగా చంద్రంపాలెం జాతర గట్టుపై వెలసిన పంచముఖ ఆంజనేయ స్వామి, షిర్డీసాయినాథ సహిత దుర్గాలమ్మ వారికి ఆలయ అర్చకులు పటాన్నల హరిప్రసాద్‌శర్మ, మూర్తిశర్మలు విశేష పూజలు నిర్వహించారు. స్థానిక భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి అమ్మవారిని దర్శించుకుని పూజలు చేశారు. దుర్గాలమ్మను వరలక్ష్మిగా అలంకరించి కుంకుమ, పూలతో పూజలు జరిపారు. ఈ సందర్భంగా చంద్రంపాలేనికి చెందిన పిళ్లా వెంకటరమణ, అమ్మాజీ దంపతుల సహాయ సహకారాలతో అమ్మకు పులిహోర, ఇతర ప్రసాదాలు సమర్పించి భక్తులకు పంచిపెట్టారు. కార్యక్రమాలను ఆలయ కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలు పర్యవేక్షించారు.

ఉపాధి హామీ పనుల్లో నిర్లక్ష్యం వద్దు



మద్ది గ్రామ సభలో మాట్లాడుతున్న ఎంపీపీ రాంబాబు



గంభీరం పంచాయతీ గ్రామసభలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు

తగరపువలస: చాలా చోట్ల ఉపాధి హామీ పనులు నామమాత్రంగా జరుగుతున్నాయని, అలాంటి నిర్లక్ష్యపు ధోరణి తగదని ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు అన్నారు. భీమిలి మండలం గంభీరం పంచాయతీలో శుక్రవారం జరిగిన గ్రామసభలో ఆయన మాట్లాడారు. ఉపాధి హామీ కింద 87 రకాల పనులు చేపట్టడానికి ప్రభుత్వం రూ.4,500 కోట్లు ఖర్చు చేస్తోందన్నారు. గ్రామ పంచాయతీల ద్వారా అభివృద్ధి పనులు చేయాలని సీఎం చంద్రబాబు ఆదేశించారన్నారు. ఐఐఎంఏ భూసేకరణ నష్ట పరిహారం గంభీరం ప్రజల అభీష్టం మేరకు నిర్ణయించామన్నారు. ఆర్గానిక్ పంటలు పండిస్తున్న సమీపంలోని గ్రామానికి 8 రోజులుగా విద్యుత్ సరఫరా లేదని రైతులు తన దృష్టికి తీసుకువచ్చారని ఎమ్మెల్యే చెప్పారు. ఇలాంటి సమస్యలపై అధికారుల్లో జవాబుదారీ తనానికే గ్రామసభలు జరుపుతున్నామన్నారు. కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిర ప్రసాద్ మాట్లాడుతూ పంచాయతీ వ్యవస్థను పటిష్ట పరచడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. గంభీరం గ్రామాన్ని ఆదర్శంగా తీర్చిదిద్దుతామన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ ధనలక్ష్మి, ఎంపీపీ మజ్జి ప్రియాంక శారద తదితరులు పాల్గొన్నారు.

మొక్కుబడిగా గ్రామసభలు

భీమిలి మండలంలోని 16 గ్రామ పంచాయతీల్లో జరిగిన గ్రామసభలు మొక్కుబడిగా సాగాయి. ఒకటి రెండు పంచాయతీలు తప్ప చాలా చోట్ల సభలు చప్పగా సాగాయి. తాటితూరు, దాకమర్రి పంచాయతీల గ్రామ సభల్లో ఎంపీడీవో డాక్టర్ జానకి, సర్పంచ్‌లు చెల్లూరి పైడప్పడు, శిరిగుడి సంతోషి తదితరులు పాల్గొన్నారు. మిగిలిన పంచాయతీల్లో గ్రామసభలకు ప్రత్యేక అధికారులను నియమించారు.

పంట కాలువల శుభ్రతకు ప్రాధాన్యం

పద్మనాభం: పంట కాలువల్లో పూడిక తీయడానికి ప్రాధాన్యమివ్వాలని ఎంపీపీ కంటుబోతు రాంబాబు అన్నారు. మండలంలోని గ్రామ పంచాయతీల్లో శుక్రవారం గ్రామ సభలు జరిగాయి. మద్దిలో జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. చెరువుల్లోనే కాకుండా పంట కాలువల్లో పూడిక తీస్తే పంటలకు సాగు నీరు అందుతుందని తెలిపారు. రాజకీయాల కతీతంగా గ్రామాల అభివృద్ధికి అందరు సహకరించాలని కోరారు. ఎంపీడీవో ఎం.విజయ్ కుమార్, సర్పంచ్ బుగత సన్యాసమ్మ, వైఎస్సార్‌సీపీ మండల యువజన విభాగం అధ్యక్షుడు బుగత సత్యనారాయణ పాల్గొన్నారు.

ట్రిపుల్ ఐటీ విజేతలకు నగదు బహుమతులు

చంద్రంపాలెం జెడ్పీ హైస్కూల్ విద్యార్థులకు సీఎంఆర్ చేయూత



విద్యార్థులకు నగదు బహుమతులు అందిస్తున్న ఆర్‌జేడీ విజయభాస్కర్ తదితరులు

మధురవాడ: విద్యార్థులు ఉన్నతంగా రాణించి చదువుకున్న పాఠశాలకు అతిథులుగా వచ్చే స్థాయికి ఎదగాలని విద్యా శాఖ ఆర్‌జేడీ విజయభాస్కర్ ఆకాంక్షించారు. చంద్రంపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ట్రిపుల్ ఐటీ విజేతలకు సీఎంఆర్ సంస్థ అందజేసిన నగదు బహుమతులు శుక్రవారం ఆయన మాజీ పోలీస్ అధికారి టి.ఎస్.ఆర్.ప్రసాద్ తదితరులతో కలిసి అందజేశారు. ఈ సందర్భంగా అతిథులు మాట్లాడుతూ బాగా చదివిన వారికి ఎప్పుడూ గుర్తింపు, ప్రోత్సాహం ఉంటుందని, ట్రిపుల్ ఐటీ సీట్లు సాధించిన వారికి కొన్నేళ్లుగా సీఎంఆర్ అధినేత తోడ్పాటు అందిస్తున్నారన్నారు. ఈ పాఠశాలలో 10వ తరగతిలో మంచి మార్కులు పొంది సీడబ్ల్యూఎస్ఎన్ కోటాలో ఎచ్చర్లలో సీట్లు సాధించిన కె.మైథిలి, వై.హారికకు రూ.25 వేల చొప్పున, నూజివీడులో సీటు సాధించిన తరుణ్, ఎచ్చర్లలో సీట్లు సాధించిన డి.యశ్వంత్, ఎల్.అచ్యుతరావులకు రూ.15 వేల చొప్పున నగదు బహుమతులతోపాటు ఇతర సామగ్రి అందజేశారు. ఆ సంస్థతో పాటు ఇతర దాతలు వంద మంది క్రీడాకారులకు స్పోర్ట్స్ కిట్లు పంపిణీ చేశారు. ఇన్‌చార్జ్ హెచ్ఎం ఎస్.వి.ఎస్.సోమయాజులు ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో సునీల్ మహంతి, పీడీ రాము, పాఠశాల కమిటీ చైర్మన్ అచ్యుతరావు, సునీల్, దాతలు, అతిథులు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ భూమి కబ్జాకు కూటమి నాయకుల బరితెగింపు



దబ్బంద సర్వే నంబర్ 56లో పొక్లెయిన్‌తో కొండను చదును చేస్తున్న కబ్జాదారులు

తగరపువలస: ఆనందపురం మండలం మామిడిలోవ పంచాయతీ దబ్బందలోని సర్వే నంబర్ 56లో ఎ.2.16 సెంట్లు కొండపోరంబోకు స్థలాన్ని కబ్జా చేయడానికి కూటమి నాయకులు విశ్వప్రయత్నం చేశారు. శుక్రవారం పొక్లెయిన్‌తో కొండను తవ్వి చదును చేస్తుండగా దబ్బంద ప్రజలు వ్యతిరేకించి నిలదీయగా.. కబ్జాదారులు పెడచెవిన పెట్టి తమ పనులు యథేచ్ఛగా కొనసాగించారు. మేమూ ఇక్కడి వారిమే, అధికారంలో ఉండి ఆక్రమిస్తే తప్పేంటని ఎదురు ప్రశ్నించారు. దీంతో స్థానికులు కూటమి నాయకుల ప్రతాపాన్ని వైఎస్సార్‌సీపీ నాయకులు, మండల రెవెన్యూ అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. ప్రభుత్వ స్థలాన్ని కబ్జాదారుల నుంచి రక్షించకపోతే ఆందోళనలకు సిద్ధమవుతామని హెచ్చరిస్తున్నారు.

గంభీరం రిజర్వాయర్ వద్ద ప్రాణనష్టాన్ని నివారించండి



ఎమ్మెల్యే గంటా, కలెక్టర్ ప్రసాద్‌లకు సమస్య వివరిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకుడు రామకృష్ణ

తగరపువలస: ఆహ్లాదం కారణంగా పిక్నిక్ స్పాట్‌గా ప్రసిద్ధి గాంచిన ఆనందపురం మండలం గంభీరం రిజర్వాయర్ వద్ద సంభవించే ప్రాణనష్టాన్ని నివారించాలని వైఎస్సార్‌సీపీ నాయకుడు బొట్ట రామకృష్ణ కోరారు. ఈ మేరకు శుక్రవారం గంభీరం పంచాయతీలో జరిగిన గ్రామసభలో ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు, కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిర ప్రసాద్‌లను ఆయన కలిసి వినతిపత్రం అందించారు. రిజర్వాయర్ లోతు తెలియని వందలాది మంది విద్యార్థులు మునిగి మృత్యువాత పడ్డారన్నారు. ప్రతి 2, 3 నెలలకు ప్రమాదాలు జరిగి 10 నుంచి 15 మంది చనిపోతున్నారని వివరించారు. భద్రతా ఏర్పాట్లలో భాగంగా రిజర్వాయర్ వద్ద సెక్యూరిటీ, ఫెన్సింగ్, సీసీ కెమెరాలను ఏర్పాటు చేయాలని కోరారు.

ఎయిడ్స్‌పై విద్యార్థులకు అవగాహన



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ఐసీటీసీ కౌన్సిలర్ వెంకటరాజు

భీమునిపట్నం: ప్రాణాంతకమైన ఎయిడ్స్ వ్యాధిపై ప్రతి విద్యార్థి ఎంతో జాగ్రత్తగా ఉండాలని ప్రభుత్వ ఆస్పత్రిలో హెచ్ఐవీ రోగుల కోసం ఏర్పాటు చేసిన సమీకృత సలహా, పరీక్ష కేంద్రం(ఐసీటీసీ) కౌన్సిలర్ వెంకటరాజు అన్నారు. ఇక్కడి ప్రభుత్వ జూనియర్ కళాశాల వద్ద ఏపీ ఎయిడ్స్ కంట్రోల్ సొసైటీ వారి సహకారంతో శుక్రవారం విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఎయిడ్స్ వ్యాధి ఎలా వస్తుంది, రాకుండా తీసుకోవలసిన జాగ్రత్తల గురించి ఆయన వివరించారు. ఇక్కడి పరీక్ష కేంద్రంలో హెచ్ఐవీ పరీక్షలు నిర్వహిస్తామని, ఎవరికైనా వ్యాధి సోకినట్టు నిర్ధారణ జరిగితే వారికి మందులు కూడా అందిస్తామని తెలిపారు. వారి వివరాలను గోప్యంగా ఉంచుతామని, రోగులకే కాకుండా కళాశాలలు, పలు ప్రాంతాల్లోను అవగాహన కార్యక్రమాలను నిర్వహిస్తున్నామన్నారు. మత్తు పదార్థాలు, ఇంజక్షన్‌లు తీసుకోవడం అత్యంగా ప్రమాదకరమని, వీటి వల్ల కూడా ఎయిడ్స్ సోకే అవకాశాలు ఉన్నాయని, వాటి జోలికి కూడా వెళ్లవద్దని వెంకటరాజు సూచించారు. కళాశాల ప్రిన్సిపాల్ సిహెచ్.సూర్యప్రసాద్, యువ క్లినిక్ కౌన్సిలర్ సత్య, ఆశ వర్కర్ మీనాక్షి, అధ్యాపకులు పాల్గొన్నారు.

అంతరిక్ష యానంలో ప్రత్యేక గుర్తింపు



డైట్‌లో రూపొందించిన నమూనాలతో చాత్రోపాధ్యాయులు



చిప్పాడ జెడ్పీ హైస్కూల్‌లో అంతరిక్ష దినోత్సవం గురించి వివరిస్తున్న ఉపాధ్యాయులు

భీమునిపట్నం: అంతరిక్ష యానంలో భారతదేశం ప్రపంచ వ్యాప్తంగా ప్రత్యేక గుర్తింపు పొందిందని సమగ్ర శిక్ష జిల్లా అదనపు ప్రాజెక్ట్ కో ఆర్డినేటర్ బి.శ్రీనివాసరావు అన్నారు. స్థానిక జిల్లా విద్య శిక్షణ సంస్థ(డైట్)లో శుక్రవారం నిర్వహించిన జాతీయ అంతరిక్ష దినోత్సవంలో ప్రత్యేక ఆహ్వానితుడిగా ఆయన మాట్లాడారు. అంతరిక్ష యానంలో అగ్రదేశాలకు ఏమాత్రం తీసిపోని విధంగా గొప్ప పురోభివృద్ధిని సాధించామని, ఇది మనందరికీ ఎంతో గర్వకారణమన్నారు. కార్యక్రమ నిర్వహకుడు, అధ్యాపకుడు గొట్టేటి రవి మాట్లాడుతూ ఇక్కడి చాత్రోపాధ్యాయులు అంతరిక్ష యానంలో భారతదేశం అనే అంశంపై పలు రకాల నమూనాలను రూపొందించడంతోపాటు వ్యాసాలు రాశారని తెలిపారు. వీరు ఉపాధ్యాయులు అయిన తరువాత విద్యార్థులకు మన అంతరిక్ష కేంద్రం, దాని పనితీరుపై తెలియపరచి, వారిలో ఆసక్తి కల్పించాలని కోరారు. అధ్యాపకులు ఎల్.సుధాకర్, జి.జి.ఎస్.నాగేశ్వరరావు, ఎం.మహాలక్ష్మి, జె.మాధవి, ఎస్.త్రినాథరావు, ఆర్.నీలిమ పాల్గొన్నారు.

అంతరిక్ష యానంలో అనేక విజయాలు

తగరపువలస: భీమిలి మండలం చిప్పాడ జెడ్పీ హైస్కూల్‌లో జాతీయ అంతరిక్ష దినోత్సవం నిర్వహించారు. హెచ్ఎం ఎం.వి.టి.రత్నం ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు రేఖ అప్పారావు, విజయకుమారి, అనురాధ, సత్యవతి తదితరులు విద్యార్థులకు భారత్ అంతరిక్ష విజయాల గురించి వివరించారు. గతేడాది ఇదే రోజున చంద్రయాన్-3 విక్రమ్ ల్యాండర్‌ను విజయవంతంగా చంద్ర మండలం దక్షిణ ధ్రువంపై దించినందుకు ఏటా ఈ ఉత్సవాలు నిర్వహించాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. రోజుల తరబడి జరుపుకున్నా.. మన దేశం సాధించిన విజయాలు లెక్కలేనన్ని ఉన్నాయన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులకు క్విజ్ పోటీలు నిర్వహించి బహుమతులు అందించారు.

చెట్ల కొమ్మలు తగిలి విద్యుత్ సరఫరాకు అంతరాయం

తగరపువలస: ఆనందపురం మండలం గంభీరం పంచాయతీ కల్లివానిపాలెంలో ఎనిమిది రోజులుగా విద్యుత్ సరఫరా లేదని శుక్రవారం జరిగిన గ్రామ సభలో స్థానిక రైతు ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావుకు ఫిర్యాదు చేసిన మేరకు సిబ్బంది వెంటనే తనిఖీలు చేపట్టారు. రైతుకు సంబంధించిన వ్యవసాయ క్షేత్రాన్ని పరిశీలించగా.. విద్యుత్ సరఫరా ఉన్నట్టు గుర్తించామని ఆనందపురం ఏఈఈ సురేష్‌కుమార్ తెలిపారు. వర్షాలు కురిసినప్పుడు లైన్‌లో చెట్ల కొమ్మలు తగిలి ఫ్యూజులు పోతున్నాయన్నారు. గాలికి చెట్ల కొమ్మలు తగలడం వల్లే సమస్య అని, విద్యుత్ సరఫరా లేకపోవడం కాదన్నారు. వెంటనే సిబ్బంది కొమ్మలను తొలగించారు.

సృజనాత్మక ఆలోచనలతో ముందుకు రావాలి



శాస్త్రవేత్త జగన్నాథ కుమార్‌ను సత్కరిస్తున్న గీతం ప్రొఫెసర్లు

కొమ్మాది: గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయంల స్కూల్ ఆఫ్ సైన్స్, ఫిజిక్స్ విభాగంలో శుక్రవారం నేషనల్ స్పేస్ డేను ఉత్సాహంగా జరిపారు. కార్యక్రమాన్ని ముఖ్య అతిథి భారత వాతావరణ శాఖకు చెందిన శాస్త్రవేత్త డాక్టర్ ఎస్.వి.జగన్నాథ కుమార్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అంతరిక్ష సంబంధిత ప్రయోగాలు, బహుళ శాస్త్ర విషయాలు కలయికగా ఉంటాయని, ఒకే ఒక సబ్జెక్టుతోనే పరిమితం కాదని పేర్కొన్నారు. భారత వాతావరణ శాఖ పరిస్థితులను అంచనా వేయడానికి అంతరిక్ష సాంకేతికతలను ఎలా వినియోగిస్తుందో వివరించారు. భారత అంతరిక్ష కార్యక్రమాలను బలపరిచేందుకు సృజనాత్మక ఆలోచనలతో యువత ముందుకు రావాలని సూచించారు. అనంతరం గీతం సైన్స్ స్కూల్ డీన్ ప్రొఫెసర్ కెఎస్ కృష్ణ, ప్రిన్సిపాల్ వేదవతి తదితరులు శాస్త్రవేత్త జగన్నాథ కుమార్‌ను సత్కరించారు.